క్లుప్తంగా

పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి

ఉదయగిరి: ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను పంచాయతీ కార్యదర్శులు సాధించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా పన్ను బకాయిలను తెలుసుకుని సూచనలు చేశారు. మండలంలోని 17 పంచాయతీల్లో ఇంటి పన్నుల బకాయిలు రూ.54.36 లక్షలు ఉండగా, ఇప్పటి వరకు రూ.39.98 లక్షలు (26శాతం)వసూలు చేయడం జరిగిందన్నారు. మార్చి నెలాఖరుకు నూరుశాతం వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ గోపి, సీఏ గాజుల ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి

కావలి రూరల్: కావలి నియోజవర్గంలోని బాధలో ఉన్న దళిత కుటుంబాలను పరామర్శించేందుకు బీజేపీ తలపెట్టిన దళిత భరోసా యాత్రను పోలీసులు అరెస్టులతో అణచివేయడం దారుణమని బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఖండించారు. దళిత భరోసా యాత్రను పోలీసులు అడ్డుకోవడంపై కావలి ఆర్డీఓ శీనానాయక్‌ను బీజేపీ నాయకులు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. జలదంకి ఎంపీటీసీ కుట్టుబోయిన మాధవరావు, బీజేపీ నాయకులు ఆదినారాయణ, శివశంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాపురం సచివాలయ భవనం మార్పు

ఉదయగిరి: తిరుమలాపురం గ్రామ సచివాలయ భవనాన్ని గుడినరవలో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఆవుల వెంకటరమణయ్య శనివారం తెలిపారు. ఇప్పటి వరకు గ్రామ సచివాలయాన్ని గుడినరవలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అద్దె భవనానికి సంబంధించిన 11 నెలల అద్దె బకాయి రూ.22వేలు భవన యజమాని కుమార్తెకు చెల్లించినట్లు తెలిపారు.

శనగ పంట పరిశీలన



అనుమసముద్రంపేట: మండలంలోని హసనాపురంలో సాగు చేసిన శనగ పైరును ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు ఓబయ్య, సురేఖాదేవి శనివారం పరిశీలించారు. పంట పూత, పిందెదశలో ఉన్నందున కాయతొలుచు పురుగు నివారణ చర్యలను రైతులకు సూచించారు. లింగాకర్షక బుట్టలను ఎకరాకు నాలుగు అమర్చాలని సూచించారు. ఏఓ టీ రజని, వీఏఏలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



చేజర్ల: మండలంలోని ఏటూరు మెయిన్, ఎస్సీ కాలనీ పాఠశాలల్లోని విద్యార్థులకు గ్రామానికి చెందిన సోమారపు విఠల్‌రెడ్డి శనివారం విద్యాసామగ్రి అందజేశారు. తన తండ్రి జయరామిరెడ్డి జ్ఞాపకార్థంగా ఏటా రథసప్తమి నాడు విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురామిరెడ్డి, భరద్వాజ, ప్రవీణ, హేమన్య, వైష్ణవి, సోమారపు రంగారెడ్డి, హరిత, ఝాన్సీ, కొండా శేఖర్‌రెడ్డి, ఇందూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



ఆత్మకూరు: పట్టణానికి చెందిన వన్నం నాగరాజు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు ఐవైసీ యాప్ ద్వారా చేపట్టిన ఆన్‌లైన్ ఓటింగ్ ప్రక్రియలో తాను అత్యధిక ఓట్లతో గెలుపొందినట్లు నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చేవూరి శ్రీధర్‌రెడ్డి సహకారంతోనే తన గెలుపు సాధ్యమైందని ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యతోనే ఉజ్వల భవిత

వింజమూరు: విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని, విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కలిగిరి సీఐ సాంబశివరావు అన్నారు. స్థానిక నేతాజీ వికాస్ హైస్కూల్‌లో వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నతనం నుంచే దేశభక్తి, సేవాభావం, సామాజిక స్పృహతో మెలగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపల్ వెంకటరత్నం, విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి, పీటీ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం గురుస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా ఆదివారం పనిచేయనున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రాణరక్షణలో ప్రథమ చికిత్స కీలకం



ప్రథమ చిక్సితపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ శిక్షకులు

కావలి రూరల్: ప్రాణరక్షణలో ప్రథమ చికిత్స ఎంతో కీలకమని రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ శిక్షకులు బీ లక్ష్మీనంద పేర్కొన్నారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కావలి డిపో ఆవరణంలో ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ శిక్షకులు మాట్లాడుతూ ఎవరైనా ఆర్టీసీ ప్రయాణికులు గుండె నొప్పితో బాధపడుతుంటే సీపీఆర్ విధానంలో కృత్రిమ శ్వాస కల్పించడం, గుండెపై ఒత్తిడి కలుగజేయడం ద్వారా ప్రాణరక్షణ కల్పించవచ్చని తెలిపారు. ప్రమాదాల్లో తల, ఇతర అవయవాలు గాయపడినప్పుడు అందుబాటులోని రుమాలు లేదా చున్నీని ఉపయోగించి కట్టుకట్టి ప్రథమ చికిత్స ఎలా అందించాలో వివరించారు. అనంతరం మనిషి బొమ్మను చూపిస్తూ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఫిబ్రవరి 1న ఆర్టీసీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, బస్టాండ్ ఆవరణంలోని వ్యాపారుల సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం రామకృష్ణ, అసిస్టెంట్ గ్యారేజ్ ఇన్‌చార్జి బాబూరావు, డ్రైవర్లు, రెడ్‌క్రాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ ప్రభుత్వం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి

సోమశిల: ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ జిల్లాలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటూ అండగా నిలుస్తోందని అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడారు. జిల్లాలోని రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. పంట ఉత్పతుల అమ్మకాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. తొలుత ఆర్‌డబ్ల్యూఎస్‌పై సమీక్షిస్తూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్‌కు సూచించారు. విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించాలని ఎంఈఓ బాలకృష్ణారెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా పడమటికంభంపాడులో ఓ ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలకు వస్తుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎంపీటీసీ రాధమ్మ సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంఈఓ వెంటనే విచారించి మెమో జారీ చేస్తామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వైద్యశాఖపై సమీక్షిస్తూ బొమ్మవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవన నిర్మాణానికి స్థల సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌కు జెడ్పీటీసీ సూచించారు. ప్రభుత్వం అనంతసాగరం పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్ నర్సులు, మరో వాచ్‌మెన్‌ను కేటాయించి 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఉపాధిపై సమీక్షిస్తూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు. ఐసీడీఎస్‌పై సమీక్ష సందర్భంగా ఆత్మకూరు సీడీపీఓ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇస్కపల్లి పంచాయతీలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఒక అంగన్‌వాడీ కార్యకర్తను ఇబ్బందులకు గురిచేస్తూ, మరొకరికి ఒత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై సూపర్‌వైజర్ రత్నమ్మను జెడ్పీటీసీ ప్రశ్నించగా, సరైన సమాచారం ఇవ్వకపోవడంతో సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. డీటీ ప్రదీప్ మాట్లాడుతూ మండలంలో 3,967 చుక్కల భూముల సమస్యలు ఉండగా, ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక జీఓతో 3276 చుక్కల భూములు సమస్యల పరిష్కారానికి నోచుకోన్నాయని తెలిపారు. మండలంలోని ఓటర్లు తమ ఓటును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలు అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, పాణెం శ్రీనివాసులు, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాలువ నరసింహులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ నరహరిరావు

అల్లూరు: ఇటీవల సారారహిత గ్రామంగా ప్రకటించిన మూర్తిరాజుపురం గ్రామంలో సెబ్ కోవూరు సీఐ నరహరిరావు తన సిబ్బందితో కలిసి శనివారం సందర్శించారు. సారా తయారీ ఆనవాళ్లపై తనిఖీలు చేశారు. గతంలో సారా తయారీ కేసుల్లో పట్టుబడిన వారికి మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు. సారా తయారీని వీడి జీవనోపాధి వృత్తులపై దృష్టి సారించాలన్నారు. ఎవరైనా సారా తయారు చేస్తుంటే వెంటనే 14500 నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. నిందితులపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుచ్చి సీఐ సూర్యనారాయణ, సెబ్ ఎస్సైలు టీ శ్రీనివాసులు, ప్రభాకర్, అంకయ్య, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన ప్రదర్శన



ఆత్మకూరు: ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ సిస్టంను రద్దు చేసి పాత మస్టర్ విధానాన్ని అమలు చేయాలని, ఫేస్ యాప్ హాజరును పునఃపరిశీలించాలని, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్ ఎం రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఎస్‌కే మునీర్ బాషా, నాగరాజు, బీ హజరత్తయ్య, నాగేంద్ర, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల సర్వేపై గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్

చేజర్ల: మండలంలోని రెడ్డివారికండ్రిక పాఠశాలలో తహసీల్దార్ శివకృష్ణయ్య ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల సర్వేపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి దేవస్థానంలో ఉప ఆలయంగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి పెళ్లేరు రెవెన్యూ పరిధిలో 921.29 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూములను అనాధిగా రైతులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. త్వరలో ఆలయ భూములను రీసర్వే చేపట్టనున్న నేపథ్యంలో గ్రామసభ నిర్వహించినట్లు వివరించారు. రీ సర్వే డీటీ ఎం గిరీష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం కోదండ రామస్వామి ఆలయ ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై చేయిచేసుకున్న ఉపాధ్యాయుడు

ఉదయగిరి: పెన్ను, పెన్సిల్ తెచ్చుకోలేదనే సాకుతో 8వ తరగతి విద్యార్థినిపై ఉపాధ్యాయుడు చేయిచేసుకోవడంతో సొమ్మసిల్లిపడిపోయింది. ఈ ఘటన గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు..గండిపాళేనికి చెందిన అరుణ, మాల్యాద్రి దంపతుల కుమార్తె స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. చదువులో చురుగ్గా రాణిస్తున్నప్పటికీ సదరు విద్యార్థిని శనివారం పెన్ను, పెన్సిల్ తెచ్చుకోలేదనే సాకుతో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు చంద్రా శ్రీనివాసరావు చేయిచేసుకోవడంతో సొమ్మసిల్లి పడిపోయింది. ఈ విషయాన్ని విద్యార్థులు హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లగా స్పందించ లేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల ద్వారా విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లి పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడ్ని నిలదీయగా దురుసుగా వ్యవహరించారు. ఉపాధ్యాయుడి ప్రవర్తన చూస్తున్న సహచర ఉపాధ్యాయులు, హెచ్‌ఎం ప్రేక్షకుల్లా ఉండిపోయారు. ఉపాధ్యాయుడి తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటేశ్వర్లును వివరణ కోరగా, పొరపాటు జరిగింది, మళ్లీ జరగకుండా చూస్తామన్నారు.

టీకాలను క్రమం తప్పకుండా వేయాలి



రిజిష్టర్లను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రాజశేఖరరాజు

వరికుంటపాడు: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయాలని వరికుంటపాడు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి రాజశేఖరరాజు అన్నారు. మండలంలోని అలివేలుమంగాపురంలో శనివారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వ్యాక్సిన్ రికార్డులను పరిశీలించి నిర్వహణపై వైద్యారోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. టీకాలు వేసేవారి జాబితాలు ముందుగానే తయారుచేసుకుని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హులైన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో టీకాలు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఏఎన్‌ఎం రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి

కొండాపురం : మండల ప్రజలు రథసప్తమిని శనివారం వైభవంగా జరుపుకొన్నారు. సూర్యభగవానుడికి ఇష్టమైన చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పించి సూర్యనమస్కారాలు చేశారు. మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిశుధ్యానికి సహకరించాలి

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలని కమిషనర్ ఫణికుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నగర పంచాయతీని బహిరంగ మల,మూత్ర విసర్జన రహితంగా తీర్చిదిద్దాలని తీర్మానించినట్లు తెలిపారు. అందులో కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరైనా బహిరంగంగా మల,మూత్ర విసర్జన చేస్తే రూ.500 వరకు జరిమానాతో పాటు పది రోజులు జైలుకు గురికాగలరని తెలిపారు.

వివాహిత ఆందోళన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భర్త తనను మోసం చేసి మరో మహిళతో సహజీవనం చేస్తున్నారంటూ ఇరిగేషన్ కార్యాలయం వద్ద వివాహిత ఆందోళనను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు శైలజ మాట్లాడారు. నవాబుపేటకు చెందిన తనకు ఇరిగేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణయాదవ్‌తో 2007లో వివాహమైందని చెప్పారు. కొంత కాలంగా ఆయన వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనను, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సార్, హెల్త్‌కార్డుల్లో సైతం ఆమె పేరునే పొందుపర్చారని, ఇదేమని ప్రశ్నిస్తే దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలని ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్‌ను కోరారు. పూర్వాపరాలను పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

సన్మానాలు..సత్కారాలు



ఉదయగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డిని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు శనివారం శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సీఎం ఓబుల్‌రెడ్డి, ముర్తుజాహుస్సేన్, గడియాల్చి యస్దాని, ఉప్పుటూరి శ్రీను, గొల్లపల్లి తిరుపతి, మూలె వీరారెడ్డి, వెంగళరెడ్డి, సయ్యద్ సుభాని, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, జీ శ్రీనివాసులురెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి..



ఉదయగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవాపురస్కారం అందుకున్న గండిపాళెం పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డిని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ శనివారం శాలువాతో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ పర్యవేక్షకుడికి..



ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్షయ పర్యవేక్షకుడిగా పనిచేస్తున్న బీ వెంకటేశ్వర్లు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంతో సాగర్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం శాలువాతో సన్మానించారు. సేవాసమితి ప్రతినిధులు మన్సూర్‌అలీ, షఫి, బాబు, మజీద్, మాలకొండారావు, లియాఖత్ పాల్గొన్నారు.

కొండాపురం ఎంఈఓకు..




కొండాపురం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంఈఓ రవికుమార్‌ను ఎస్టీయూ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ డేగా మహేష్, సభ్యులు హరికృష్ణ, మధుసూదన్‌రావు, మాల్యాద్రి, సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

సోమశిల ఎంఈఓకు..



సోమశిల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న అనంతసాగరం ఎంఈఓ మాటిరెడ్డి బాలకృష్ణారెడ్డిని జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డీటీ ప్రదీప్, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు పార్వతమ్మ, అక్కలరెడ్డి కొండారెడ్డి, సర్పంచ్‌లు కారుదుంపల లక్ష్మీదేవి, బొర్రా శోభ, ఎమ్మార్జీ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు..



ఆత్మకూరు: గణంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవాపురస్కారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబును మున్సిపల్ కార్యాలయంలో బస్టాండ్ కాంప్లెక్స్ చిరువ్యాపారులు, ఆర్యవైశ్య నాయకులు, సీపీఎం, సీఐటీయూ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. సీపీఎం నాయకుడు నాగయ్య, ఆర్యవైశ్య నాయకులు దోర్నాదుల సురేష్ బాబు, పొన్నూరు హజరత్తయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని డంపింగ్ యార్డు స్థల వివాదం



అధికారులతో వాగ్వావాదం చేస్తున్న చినఅంకయ్య కుటుంబసభ్యులు

కొండాపురం : మర్రిగుంట పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి సంబంధించిన స్థలం వివాదానికి పరిష్కారం లభించడం లేదు. గతంలో గ్రామంలోని 219-26 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి తహసీల్దార్, ఎంపీడీఓలు అనుమతులు ఇచ్చారు. ఆ సమయంలో సర్పంచ్ దార్ల గోపి సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి పూనుకోగా గ్రామానికి చెందిన ఇండ్ల చినఅంకయ్య సదరు భూమి తనదని అడ్డుకున్నాడు. దీంతో సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు ఇస్తూ సంపద తయారీ కేంద్రం నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల సర్పంచ్ నిర్మాణ పనులు చేపట్టేందుకు వెళ్లగా, చిన్నఅంకయ్య అడ్డుకున్నాడు. దీంతో సర్పంచ్ ఎంపీడీఓ బ్రహ్మయ్యను కలవగా, ఆయన పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను గ్రామానికి చెందిన ఇండ్ల చినఅంకయ్య, వారి కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ బ్రహ్మయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఆర్ఐ రవికుమార్, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ చెంచయ్య, ఎస్సై షేక్ జిలాని, వీఆర్వో, పంచాయితీ కార్యదర్శి, 8 మంది పోలీస్ సిబ్బంది కలిసి సంపద కేంద్రం పనులను ప్రారంభించేందుకు శనివారం జేసీబీతో స్థలం వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడున్న చినఅంకయ్య, వారి కుటుంబ సభ్యులు జేసీబీకి అడ్డునిలిచారు. తమ భూమిలో నిర్మాణ పనులు చేపడితే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. ప్రభుత్వ భూమితో మీకు సంబంధం లేదని అధికారులు చినఅంకయ్య, కుటుంబసభ్యులకు ఎంత చెప్పినా వారు వినలేదు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగి వచ్చేశారు. ఈ విషయమై తహసీల్దార్ బ్రహ్మయ్యను వివరణ కోరగా, సదరు భూమి ప్రభుత్వ భూమిగా తేల్చామన్నారు. డంపింగ్ యార్డు నిర్మాణ పనులకు అడ్డు వచ్చిన వారిని బైండోవర్ చేయమని పోలీసులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఎస్సైను వివరణ కోరగా బైండోవర్‌కు చినఅంకయ్య కుటుంబ సభ్యులు సహకరించలేదన్నారు. ప్రభుత్వ పనులను అడ్డుకున్న చినఅంకయ్య కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

పంట కోత ప్రయోగం



వరికుంటపాడు: మండలకేంద్రమైన వరికుంటపాడులోని రైతులు జీ కాంతయ్య, ఈశ్వరమ్మకు చెందిన వరి పొలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం పంట కోత ప్రయోగం చేపట్టారు. ముందుగా గుర్తించిన కొలతల ప్రకారం పంటను కోసి నూర్పిడి చేసి దిగుబడులను అంచనా వేశారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్యప్రణాళికా అధికారి(సీపీఓ) ఎస్ రాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు దిగుబడులను అంచనా వేసినట్లు తెలిపారు. గతేడాది కురిసిన మాండూస్ తుపాన్ ప్రభావంతో దిగుబడులు తగ్గాయని వివరించారు.తహసీల్దార్ అబ్దుల్‌హమీద్, సహాయ గణాంకాధికారులు శోభారాణి, శ్రీనివాసులు, ఏఎస్‌ఓలు వెంకటేశ్వర్లు, సుధాకర్, కేశవ్, వీఆర్వో శేషారెడ్డి, వీఏఏ చంద్రశేఖర్, సర్వేయర్ జాషువా, బీమా ప్రతినిధి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

మర్రిపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ప్రొవిజన్ దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దుకాణాల్లో కల్తీ నూనెలు అమ్ముతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాల్లోని నూనెను కల్తీగా అనుమానించి స్వాధీనం చేసుకున్నారు. వాటి శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటేశ్వరరావు, డాక్టర్ నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయమే పొలంబడి లక్ష్యం



రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

ఆత్మకూరురూరల్: రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అలవర్చడమే డాక్టర్ వైఎస్సార్ పొలంబడి లక్ష్యమని ఆత్మకూరు ఏడీఏ దేవసేన పేర్కొన్నారు. మురగళ్లలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడిపై వీఏఏలు, ఎంపీఈఓలు, రైతులకు శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా వరి సాగులో అధునాతన సాగు పద్ధతులతో ఖర్చులు తగ్గించుకోవడం, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఓ కిషోర్ బాబు మాట్లాడుతూ ఆకుల కత్తింపు, పిలకల తొలగింపు, తదితర ప్రయోగాల ద్వారా రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కోనేపల్లి కృష్ణవేణి, వీఏఏలు స్వప్న, ఈశ్వర్, అర్చన, శ్రీప్రవల్లిక, ఝాన్సీరాణి, ఎంపీఈఓలు ఇంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.